అభినందనలు



కీసర: రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కను సోమవారం జిల్లా కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు, దమ్మాయిగూడ మున్సిపల్ కౌన్సిలర్ గోగుల సరితావెంకటేష్, గోధుమకుంట గ్రామ ఎంపీటీసీ సభ్యురాలు మంచాల కిరణ్‌జ్యోతిప్రవీణ్, నాగారం మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. సుమతి, అరుణ తదితరులు పాల్గొన్నారు.

కార్తీక మాసం చివరి సోమవారం పూజలు



ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ మున్సిపాలిటీ, మండలంలోని గ్రామాల్లోని కార్తీక మాసం చివరి సోమవారం పూజలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శివాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. పట్టణంలోని శివారెడ్డిగూడ శివాలయం, లింగాలకుంట, అంకుషాపూర్, ఎదులాబాద్ శ్రీభ్రమరాంభిక మల్లికార్జున స్వామి ఆలయంలో స్వామివారికి పంచామృత అభిషేకం, తులసి అర్చన చేశారు. ఎదులాబాద్‌లో ఉదారి సత్యనారాయణముదిరాజ్ ఏర్పాటు చేసిన అన్నదానాన్ని ముఖ్యఅతిథిగా ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి హాజరై ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రవి, శంకరప్ప పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చూసుకోవాలి

మున్సిపల్ చైర్ పర్సన్ పావనీజంగయ్య



మాట్లాడుతున్న చైర్ పర్సన్ పావనీజంగయ్య, కమిషనర్ సాబేర్ అలీ

ఘట్‌కేసర్: మున్సిపాలిటీలో తాగునీటి సమస్య తలెత్తకుండా చూసుకోవాలని మున్సిపల్ చైర్ పర్సన్ పావనీజంగయ్య అన్నారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ సాబేర్ అలీతో కలిసి మున్సిపాలిటీ వర్క్ ఇన్‌స్పెక్టర్ల సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపాలిటీలో పంపు ఆపరేటర్లు తమ ప్రాంతాల్లో నీటి సమస్యలు తలెత్తినప్పుడు స్థానిక కౌన్సిలర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లకు సమాచారం ఇవ్వాలని సూచించారు. సమావేశంలో కౌన్సిలర్లు నర్సింగ్‌రావు, రవీందర్, వర్క్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

ఘన స్వాగతం



దేవరయాంజాల్‌లో డా.వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

శామీర్‌పేట్: కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి రావడంతో ప్రజలకు విముక్తి కలిగిందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సోమవారం సొంత ప్రాంతమైన హుస్నాబాద్‌కు నగరం నుంచి బయలుదేరారు. ఈ క్రమంలో మార్గమధ్యలోని తూంకుంట మున్సిపాలిటీతో పాటు శామీర్‌పేట మండల కేంద్రంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు ఘన స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డా.బీఆర్ అంబేద్కర్, జగ్జీవన్‌రామ్, రాజీవ్‌గాంధీ విగ్రహాల వద్ద నివాళులర్పించారు. అనంతరం దేవరయాంజాల్‌లోని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి దివంగత డా.వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి నివాళులర్పించారు. గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి, దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి, తూంకుంట మున్సిపాలిటీ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అల్వాల్ బాలాజీ ఆలయంలో సమీక్ష సమావేశం

అల్వాల్: అల్వాల్ బాలాజీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం వివిధ రకాల శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ నెల 17వ తేదీ నుంచి నిర్వహించే బ్రహ్మోత్సవాల సందర్భంగా పనులపై సమీక్షించారు. ఆలయ వంశపారంపర్య చైర్మన్ రాజాగోపాల్ సెంచర్, ఆలయ ఈవో వీరేశం, మున్సిపల్ సూపరింటెండెంట్ స్వామి, ప్రభుత్వ ఆస్పత్రి డాక్టర్ ప్రసన్నకుమారి, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్, స్థానిక పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆర్కేపురం చెరువును సుందరీకరిస్తాం

అల్వాల్: నేరేడ్‌మెట్ డివిజన్‌లోని ఆర్కేపురం చెరువుని సోమవారం అధికారులతో కలిసి మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి స్థానిక కార్పొరేటర్ కొత్తపల్లి మీనా ఉపేందర్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. పెండింగ్‌లో పనులు పూర్తిచేసి చెరువు సుందరీకరణకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో డీసీ రాజు, నీటిపారుదల శాఖ అధికారులు, స్థానిక నాయకులు ఉపేందర్‌రెడ్డి, జీకే హన్మంతరావు, శివ, శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి, వసంత్, రమేష్, రవీందర్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప పడిపూజ

మేడిపల్లి: ఆధ్యాత్మిక ఉన్నతి, మానసిక ప్రశాంతతకు దీక్షలు తోడ్పడతాయని మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. శ్రీగురు ధర్మశాస్త్ర సేవాసమితి ఆధ్వర్యంలో బ్రహ్మశ్రీ వై.రాజన్ నంబూద్రి గురుస్వామి పర్యవేక్షణలో మేడిపల్లి శ్రీవీరాంజనేయ స్వామి దేవాలయ ప్రాంగణంలో అయ్యప్ప భక్తులు భక్తిశ్రద్ధలతో వైభవోపేతంగా సోమవారం మూల నరేష్ గురుస్వామి నిర్వహించిన అయ్యప్ప స్వామి 18వ మహా పడిపూజ నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే మల్లారెడ్డి పాల్గొని స్వామి వారి ఆశీర్వాదాలను పొందారు. మహాపడి పూజలో జంట కార్పొరేషన్లతో పాటు నగరంలోని వివిధ ప్రాంతాల అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు.

ఆశల పల్లకిలో.. గ్యారంటీలు

కొత్త ప్రభుత్వం వైపు జిల్లా ప్రజల ఎదురుచూపు



సాక్షి, మేడ్చల్ జిల్లా: అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా 'మార్పు కావాలి.. కాంగ్రెస్ రావాలి' అనే నినాదంతో ఆరు గ్యారంటీల పేరిట ఓటర్లకు హస్తం పార్టీ చేరువైంది. అందుకు తగ్గట్లుగానే రాష్ట్రంలో తొలిసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ముఖ్యమంత్రిగా ఎనుముల రేవంత్‌రెడ్డి.. ఆరు గ్యారంటీలపై తొలి సంతకం చేశారు. 100 రోజుల్లోనే హామీలను నెరవేరుస్తామన్నారు. వీటిలో రెండు గ్యారంటీలు ఇప్పటికే అమల్లోకి వచ్చాయి.

గృహజ్యోతితో పేదలకు లబ్ధి

ఆరు గ్యారంటీల్లో మరొకటి గృహజ్యోతి పథకం. దీనిలో భాగంగా పేదల ఇళ్లకు 200 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్ సరఫరా కానుంది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో గృహ విద్యుత్తు కనెక్షన్లు 14,44,060 ఉండగా, ఇందులో సుమారు 50 శాతం ఈ కేటగిరీలోకి రానున్నట్లు విద్యుత్ శాఖ వర్గాలు పేర్కొంటున్నాయి. పెరిగిన కరెంట్ ఛార్జీల నుంచి ఉపశమనం లభించనుందనే ఆశతో పేద, మధ్యతరగతి కుటుంబాలు కొత్త ప్రభుత్వం వైపు ఎదురుచూస్తున్నాయి.

మహిళలను ఆకర్షించిన మహాలక్ష్మి..

మహిళలను తమ పార్టీ వైపు ఆకర్షించడానికి కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీల్లో మొదటిది మహాలక్ష్మి. ప్రతి నెలా మహిళలకు రూ.2,500 చొప్పున అందించనున్నారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 3,378 స్వయం సహాయక సంఘాలు ఉండగా, ఇందులో 36,282 మంది మహిళలు సభ్యులుగా ఉన్నారు. దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న కుటుంబాలను ఎంపిక చేసి అర్హులను గుర్తిస్తే ఎంత మంది ఈ పథకానికి లబ్ధిదారులు అవుతారనేది తెలియనుంది.

- మహాలక్ష్మి..లో భాగంగా గ్యాస్ సిలిండర్ రూ.500కు అందించనుండటంతో జిల్లాలో సుమారు 13 లక్షల కుటుంబాలకు 'బండ భారం' తొలగిపోనుంది.

పింఛన్‌దారుల్లో కొత్త ఉత్సాహం

ఆరు గ్యారంటీల్లో భాగంగా ప్రస్తుతం ఉన్న పింఛన్‌ను రూ.4 వేలకు పెంచనున్నట్లు కాంగ్రెస్ ప్రకటించింది. ప్రస్తుతం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా పరిధిలో 1,47,053 మంది ఆసరా పింఛన్ అందుకుంటున్నారు. వీరితో పాటు కొత్తగా అర్హులు చేరితే మరో 80వేల మందికి పింఛన్ అందే అవకాశముంటుంది. ఆరోగ్యబీమా కింద పేదలకు రూ.10 లక్షల చొప్పున ఆరోగ్య బీమా కల్పించేందుకు చేయూత పథకాన్ని ప్రభుత్వం శనివారం ప్రారంభించింది. దీన్ని ఆహార భద్రతా కార్డుదారులకు వర్తింపజేయాలనుకుంటే జిల్లాలో 5,24,153 లక్షల కుటుంబాల తరఫున ప్రభుత్వమే బీమా సంస్థలకు ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది.

ఇందిరమ్మ ఇళ్లు..

గూడు లేని వారి గోస తీర్చడానికి 'ఇందిరమ్మ గృహ నిర్మాణం' పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం అమలుచేయనుంది. ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల చొప్పున సాయం అందించనుంది. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమకారులకు 250 గజాల చొప్పున ఇంటి స్థలం కేటాయించనుంది. వీటిద్వారా జిల్లాలో సుమారు లక్ష కుటుంబాలకు సొంతింటి కల నెరవేరనుంది.

అన్నదాతలు, కూలీలకు అండగా..

అధికారంలోకి వస్తే 'రైతు భరోసా' పేరిట రైతులు, కౌలురైతులకు ఎకరాకు రూ.15వేలు అందిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. వ్యవసాయ కూలీలకూ ఏడాదికి రూ.12వేల చొప్పున ఇస్తామంది. వరి పంటకు క్వింటాకు బోనస్ రూ.500 చెల్లిస్తామని తెలిపింది. వీటివల్ల జిల్లాలో 47,506 మంది రైతులు లబ్ధి పొందనున్నారు. కౌలు రైతులు, వ్యవసాయ కూలీల్లో అర్హులెవరో తేల్చాల్సి ఉంది.

'యువ వికాసం'తో సువర్ణావకాశం

యువ వికాసం పేరిట ప్రవేశపెట్టే మరో గ్యారంటీతో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ఏటా ఉన్నత విద్య అభ్యసించే విద్యార్థులకు లబ్ధి కలగనుంది. వీరికి రూ.5 లక్షల విద్యా భరోసా కార్డును అందించాలని కాంగ్రెస్ నిర్ణయించింది. అయితే ఏ కేటగిరీ విద్యార్థులకు ఇది వర్తిస్తుంది..? భరోసా కార్డు ద్వారా ఇచ్చే డబ్బులను ఏ ప్రాతిపదికన ప్రభుత్వం జమ చేయనుందనే విషయంలో స్పష్టత రావాల్సి ఉంది. ప్రతి మండలంలో ఇంటర్నేషనల్ స్కూల్ ఏర్పాటు చేస్తామనే హామీతో జిల్లాలో 15 మండలాల విద్యార్థులకు మేలు జరగనుంది.

రాబోయే ఎన్నికలకు సిద్ధం కావాలి



జిల్లా కలెక్టర్ గౌతమ్

సాక్షి, మేడ్చల్ జిల్లా: రాబోయే ఎన్నికలకు అధికారులు సిద్ధంగా ఉన్నారని, ఈ విషయంలో వారితో సమీక్ష సమావేశాలు నిర్వహించి ఎన్నికల విధులపై అప్రమత్తం చేస్తున్నామని జిల్లా కలెక్టర్ గౌతమ్ తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాలను తప్పకుండా పాటిస్తూ అధికారులకు అవసరమైన ఆదేశాలు జారీ చేస్తున్నామన్నారు. ఓటరు జాబితాను మరోసారి సమగ్రంగా పరిశీలిస్తామన్నారు. తొలగించిన ఓటర్ల వివరాలు సమగ్రంగా ఇంటింటి సర్వే చేపట్టి పరిశీలిస్తామన్నారు. డూప్లికేట్ ఓటర్లు తొలగించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అర్హులైన ఏ ఒక్కరి పేరు కూడా జాబితా నుంచి తప్పిపోకుండా జాగ్రత్తలు తీసుకుంటామన్నారు. ఆయా కారణాల వల్ల ఓటర్ల జాబితా నుంచి తొలగించిన పేర్లను మరోమారు పరిశీలించి, పోలింగ్ స్టేషన్ వారీగా క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి, అర్హులైన వారికి ఓటు హక్కు కల్పిస్తామని పేర్కొన్నారు. అనంతరం సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా అన్ని ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో జరిగేలా అధికారులు ఇప్పటి నుంచే ప్రణాళికబద్ధంగా ముందుకు వెళ్లాలని కలెక్టర్ గౌతమ్ తెలిపారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ, ఈఆర్వోలు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రెండుచోట్ల ప్రజాదర్బార్

మేడ్చల్: ప్రజల సమస్యలను తెలుసుకుని వాటికి పరిష్కార మార్గాలు చూపేందుకు నిర్వహించే ప్రజాదర్బార్‌ను మేడ్చల్‌లో సోమవారం రెండుచోట్ల అధికారులు విడివిడిగా నిర్వహించారు. పంచాయతీ రాజ్, రెవెన్యూ అధికారుల సమన్వయ లోపంతో అధికారులు విడివిడిగా దర్బార్‌ను నిర్వహించారు. గతంలో మండల పరిషత్ కార్యాలయంలో దర్బార్‌ను ఏర్పాటు చేసి అక్కడే అన్ని శాఖల అధికారులు హాజరై వారి శాఖల అర్జీలు తీసుకుని పరిష్కరించేవారు. అధికారుల సమన్వయ లోపంతో తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శైలజ, మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ పద్మావతి దర్బార్ నిర్వహించారు. మండల పరిషత్ ప్రజా దర్బార్‌లో ఎంపీపీ రజిత రాజమల్లారెడ్డి, జెడ్పీటీసీ శైలజవిజయానంద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మండల పరిషత్ కార్యాలయంలో ప్రజా దర్బార్



రెవెన్యూ కార్యాలయంలో ప్రజా దర్బార్

'మనబడి'పై ఆశలెన్నో..?

- ప్రభుత్వ స్కూళ్లలో గదుల నిర్మాణం, వసతులు
- గత ప్రభుత్వం హయాంలో అరకొర పనులు
- టార్గెట్ 176.. పూర్తయినవి 50 మాత్రమే..
- 96 పాఠశాలల్లో నిధులు జాప్యం
- కొత్త ప్రభుత్వంపై తల్లిదండ్రుల ఆశలు

సాక్షి, మేడ్చల్ జిల్లా: కొత్త ప్రభుత్వం ఏర్పాటుతో సర్కారు పాఠశాలల్లో 'మన ఊరు.. మనబడి'పై పనుల వేగవంతం అవుతాయని విద్యార్థుల తల్లిదండ్రులు ఆశిస్తున్నారు. ఏడాది క్రితమే పూర్తి కావాల్సిన పనులు నిధుల లేమితో మెల్లగా సాగుతున్నాయి. అదనపు గదుల నిర్మాణ పనులు మాత్రం నత్తకు నడక నేర్పుతున్నాయి. కొత్త ప్రభుత్వం మన ఊరు-మన బడి కింద చేపట్టిన అభివృద్ధి పనులకు పెండింగ్ నిధులను విడుదల చేసి, సకాలంలో పూర్తి చేయగలదన్న నమ్మకాన్ని జిల్లా ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో రెండున్నర ఏళ్ల కిందట 176 ప్రభుత్వ పాఠశాలల్లో అభివృద్ధి పనులను ప్రారంభించగా, ఇప్పటి వరకు 50 ప్రభుత్వ బడుల్లోనే పనులు పూర్తయ్యాయి. మరో 96 పాఠశాలల్లో నిధులు జాప్యంగా నడుస్తున్నాయి. పెండింగ్ పనులను సత్వరమే పూర్తి చేసేందుకు జిల్లా అధికార యంత్రాంగం ప్రత్యేక కార్యాచరణతో పాఠశాల యాజమాన్య కమిటీలు, ఉపాధ్యాయులు, స్వచ్ఛంద సంస్థలు, స్థానిక సంస్థల ప్రతినిధులను భాగస్వామ్యంతో ముందుకు సాగాలని విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థి, ఉపాధ్యాయ సంఘాలు కోరుతున్నాయి.

176 బడుల్లో పనులకు.. రూ.70 కోట్లు

మన ఊరు-మన బడి కింద ఎంపికైన 176 ప్రభుత్వ పాఠశాలల్లో 12 రకాల సమస్యలను గుర్తించిన విద్యాశాఖ అధికారులు రూ.70 కోట్లతో అభివృద్ధి పనులకు ప్రణాళిక రూపొందించారు. మరుగుదొడ్లు, ప్రహరీలు, వంట గదులు, భోజనశాలలు వంటి నిర్మాణాలను ఉపాధి హామీ పథకంలో చేర్చగా, భవన మరమ్మతులు తదితర పనుల కోసం ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ నియోజకవర్గ జిల్లా అభివృద్ధి నిధులను వినియోగించేలా చర్యలు తీసుకున్నారు. నీటి వసతి తదితర మౌలిక వసతులు, స్థానిక అవసరాల కోసం ప్రత్యేకంగా నిధులు కేటాయించారు. మొదటి విడతగా ప్రభుత్వం రూ.4 కోట్లు విడుదల చేయడంతో 15 మండలాల పరిధిలోని 50 ప్రభుత్వ బడుల్లో పనులు పూర్తి కాగా, మరో 30 ప్రభుత్వ బడుల్లో ఇప్పటి వరకు టెండర్ల ప్రక్రియ పూర్తి కాలేదు. ఆయా బడుల్లో చేపట్టాల్సిన పనులకు సంబంధించిన ధర గిట్టుబాటు కానందునే టెండర్ల ప్రక్రియలో నిర్మాణ సంస్థలు పాల్గొనడం లేదు. నిబంధన ప్రకారం బడుల్లో రూ.30 లక్షలకు మించి అభివృద్ధి కార్యక్రమాలను చేపడితే.. టెండర్ల ప్రక్రియకు వెళ్లాల్సి ఉంది. ఈ విషయంపై కొత్త ప్రభుత్వం తగిన నిర్ణయం తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయ సంఘాలు కోరుతున్నాయి.

కరెంట్ ఉండని ప్రాంతాలు

మేడ్చల్: గౌడవెల్లి సబ్ స్టేషన్ పరిధిలో చెట్ల కొమ్మల నరికివేత కారణంగా పలు గ్రామాల్లో కరెంట్ సరఫరా ఉండదని ఏఈ పవన్‌చందు తెలిపారు. గౌడవెల్లి, బాసిరేగడి, జ్ఞానాపూర్ గ్రామాల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు అన్ని రకాల సర్వీసులకు విద్యుత్ సరఫరా ఉండదని ఆయన తెలిపారు.

గ్రామ పంచాయతీగా ఘనాపూర్

మేడ్చల్: మండలంలోని రాజబొల్లారం అనుబంధ గ్రామం ఘనాపూర్, ఘనాపూర్ తండాలను కలిపి నూతన గ్రామ పంచాయతీగా మార్చడానికి అధికారులు కసరత్తు ప్రారంభించారు. రాజబొల్లారం పంచాయతీగా రాజబొల్లారం, ఘనాపూర్, ఘనాపూర్ తండాలు కలిపి పునర్విభజనలో ఏర్పాటు చేశారు. గ్రామ పంచాయతీ నుంచి ఘనాపూర్‌ను పంచాయతీగా మార్చాలని నాయకులు, ప్రజలు కోరడంతో అధికారులు విచారణ చేసి ఘనాపూర్‌ను ప్రత్యేక పంచాయతీగా మర్చడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. విషయాన్ని మండల అభివృద్ధి అధికారి ధ్రువీకరించారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

ఘట్‌కేసర్: ఇయర్ ఫోన్ పెట్టుకొని మాట్లాడుకుంటూ రైలు పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన ఘట్‌కేసర్ రైల్వేస్టేషన్ సమీపంలో సోమవారం సాయంత్రం జరిగింది. స్థానికులు, రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఇయర్ ఫోన్ పెట్టుకొని మాట్లాడుకుంటూ ఘట్‌కేసర్ రైల్వే గేటు దాటుతుండగా నాంపల్లి నుంచి విశాఖపట్నం వెళ్తున్న గోదావరి ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొట్టడంతో ఓ వ్యక్తి అక్కడికక్కడే మరణించాడు. అతడి శరీరం నుజ్జునుజ్జయ్యి సుమారు 100 మీటర్లు దూరంలో శరీర భాగాలు పడ్డాయి. రైల్వే సిబ్బంది సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న రైల్వే పోలీసులు శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. ఈ మేరకు గుర్తు తెలియని వ్యక్తిగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నగరానికి గోల్డెన్ పెవిలియన్

సాక్షి, సిటీబ్యూరో: మూడున్నర దశాబ్దాలుగా విజయవాడ కేంద్రంగా భోజనప్రియులకు సేవలందిస్తున్న గోల్డెన్ పెవిలియన్ రెస్టారెంట్ నగరానికి వచ్చింది. ఈ రెస్టారెంట్‌ను ప్రారంభించిన సందర్భంగా సంస్థ యజమాని సాజిద్ మహమ్మద్ మాట్లాడుతూ నగరవాసులకు వైవిధ్యభరిత రుచులను అందిస్తున్నామని, ఇప్పటికి 80 వరకూ రెస్టారెంట్స్‌ను తమ గ్రూప్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా నగరానికి చెందిన పలువురు యువ ఫుడ్ బ్లాగర్స్ హాజరై వంటకాలను రుచి చూస్తూ సందడి చేశారు.

ఇంటి మెయిన్ డోర్ పగులగొట్టి చోరీ



ఘట్‌కేసర్: బంధువుల వివాహానికి వెళ్లి తిరిగి ఇంటికి వచ్చేసరికి ఇంట్లో చోరీ జరిగిన ఘటన ఘట్‌కేసర్ పీఎస్ పరిధిలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. సబ్ ఇన్‌స్పెక్టర్ రామునాయక్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ మేడపాటినగర్‌కు చెందిన మెరుగు సురేశ్ ఈ నెల 6న యాదాద్రి జిల్లా బీబీనగర్ మండలం జైనపల్లి గ్రామంలోని బంధువుల వివాహానికి కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లారు. తిరిగి సోమవారం ఉదయం ఇంటికి వచ్చేసరికి ఇంటి మెయిన్ డోర్ పగులగొట్టి ఉంది. లోపలికి వెళ్లి చూడగా అల్మారాలో దాచిన 20 గ్రాముల బంగారు నల్లపూసల దండ, సుమారు రూ.30 వేల నగదు కనిపించలేదు. దీంతో గుర్తు తెలియని దుండగులు డోర్ పగులగొట్టి సొత్తు, నగదు ఎత్తుకెళ్లినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రజా అర్జీలను సత్వరమే పరిష్కరించాలి



కలెక్టర్ గౌతమ్

సాక్షి, మేడ్చల్ జిల్లా: ప్రజావాణిలో ప్రజలందించే ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలని, దీంతో ఫిర్యాదుదారులకు మేలు కలుగుతుందని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ పి.గౌతమ్ తెలిపారు. ప్రజావాణిలో అందిన ఫిర్యాదులు పరిష్కారం అయ్యింది.. లేనిది వారికి స్పష్టంగా తెలియజేయాల్సిన అవసరం ఉందని అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో వివిధ సమస్యలపై ప్రజలు అందించిన 53 ఫిర్యాదులను ఆయన స్వీకరించారు. ప్రజా అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ.. వాటిని పరిష్కరించాలని కలెక్టర్ సంబంధిత జిల్లా అధికారులను ఆదేశించారు. పరిష్కరించిన అర్జీల వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయడంతో పాటు వారికి సమాచారం అందించాలని సూచించారు. ప్రజావాణి ఫిర్యాదులకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చి, వాటి పరిష్కారానికి చొరవ చూపాలని కోరారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ విజయందర్‌రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

శుభాకాంక్షలు



మేడ్చల్: జిల్లాలోని మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డిని మేడ్చల్ పట్టణానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు కలిసి సన్మానించారు. ఆయన నివాసానికి వెళ్లి శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కౌన్సిలర్ అర్చన సందీప్‌గౌడ్, నాయకులు బాబుగౌడ్, బీఆర్‌ఎస్‌కేవీ నాయకులు ఉన్నారు.

చెరువులో దూకి తల్లీకూతురు ఆత్మహత్యాయత్నం

- తల్లిని కాపాడిన స్థానికులు
- కుమార్తె కోసం గాలింపు



అబ్బన్నకుంట వద్ద కొనసాగుతున్న గాలింపు చర్యలు

శామీర్‌పేట్: కుమార్తెతో కలిసి ఓ మహిళ చెరువులో దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన సోమవారం శామీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మేడ్చల్ జిల్లా, శామీర్‌పేట మండలం, బొమ్మరాశిపేటకు చెందిన ములుగు కలమ్మ (55), కూతురు కవిత (30), సోమవారం మధ్యాహ్నం బొమ్మరాశిపేట గ్రామ పరిధిలోని అబ్బన్నకుంటలో దూకి ఆత్మహత్యకు యత్నించారు. దీనిని గుర్తించిన స్థానికులు గుర్తించి తల్లి కలమ్మను చెరువులోంచి బయటికి తీశారు. కవిత ఆచూకీ లభించకపోవడంతో శామీర్‌పేట పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు గజ ఈతగాళ్లతో గాలింపు చేపట్టారు. కలమ్మను చికిత్స నిమిత్తం ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించామని, ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు తెలియరాలేదన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

అల్వాల్: వెల్‌నెస్ అండ్ కేన్సర్ స్క్రీనింగ్ జీహెచ్‌ఎంసీ, విశ్వనాథ్ కేన్సన్ కేర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అల్వాల్ జీహెచ్‌ఎంసీ వార్డు ఆఫీస్‌లో సోమవారం పారిశుద్ధ్య కార్మికులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య కార్మికులకు వివిధ రకాల పరీక్షలు నిర్వహించారు. అల్వాల్ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి హాజరై పరీక్షల తీరును పరిశీలించారు. ఆరు విధాల కేన్సర్ పరీక్షలు జరిపారు. మగవారికి, ఆడవారికి అవసం మేరకు పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ శ్రీరామ్, డాక్టర్ స్రవంతి, డాక్టర్ మంజుల, డాక్టర్ సాయి మురళి, ఎస్ఎస్ ప్రభాకర్, వార్డు ఆఫీసర్ స్వామి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాభివృద్ధికి కృషిచేస్తా

మల్లాపూర్: మల్లాపూర్ నందీశ్వరాలయ అభివృద్ధికి తనవంతుగా కృషి చేస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. కార్తీక మాసం చివరి సోమవారం పురస్కరించుకొని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హాజరై అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు గడ్డమీది శ్రీహరిగౌడ్, పీజీ సుదర్శన్, పీఆర్.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.